సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



రణస్థలం.. ప్రథమ స్థానం

ఉపాధి హామీ పథకం అమల్లో రణస్థలం మండలం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.

- 8లో



వీరగున్నమ్మ కీర్తి..

వీరనారి సాసుమాన గున్నమ్మ సేవలను వక్తలు కొనియాడారు. గున్నమ్మ స్థూపం వద్ద నివాళులు అర్పించారు.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	కనిష్ఠం	గరిష్ఠం			
ఆమదాలవలస	35°	24°	రణస్థలం	34°	23°
ఇచ్ఛాపురం	35°	23°	కొత్తూరు	32°	24°
పలాస	34°	22°	నరసన్నపేట	34°	25°
టెక్కలి	33°	23°	శ్రీకాకుళం	34°	23°

రంజాన్ వేళలు

ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
6.12	4.29



మట్టి కుండ సల్లంగుండ

- పేదోడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ
- వేసవిలో పెరుగుతున్న మట్టికుండల విక్రయాలు
- అంగడి నుంచి ఆన్‌లైన్ దాకా అందుబాటులో..
- ఆరోగ్యానికి రక్షణగా కుండనీరు
- జిల్లాలో రూ.50 లక్షల వరకు వ్యాపారం

సండే స్పెషల్

వజ్రపుకొత్తూరు: మట్టికి మనిషికి విడదీయరాని సంబంధం ఉంది. ఇప్పుడంటే ప్రతి ఇంట్లో స్టీల్ పాత్రలు, ప్లాస్టిక్ క్యాన్‌లలో నీటిని నిల్వ చేస్తున్నాం గానీ ఒకప్పుడు కుండ నీరే దాహార్తిని తీర్చేది. ముఖ్యంగా వేసవి సీజన్‌లో ప్రతిఒక్కరూ చల్లటి కుండ నీరు తాగి వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేవారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఫ్రిజ్‌లు రావడం, ఇతర పాత్రలు అందుబాటు ధరల్లో లభ్యం కావడంతో కుండలకు గిరాకీ తగ్గిపోయింది. అయితే వేసవి సీజన్‌లో మాత్రం కుండల విక్రయాలు ఊపందుకుంటున్నాయి. మట్టి కుండల ప్రాధాన్యతను గుర్తిస్తూ.. ఇంటిలో చల్లని నీరు తాగేందుకు, చలివేంద్రాల కోసం కుండలు కొనుగోలు చేస్తున్నారు. ట్యాప్‌లతో కూడిన కుండలు ఎక్కువగా అమ్ముడుపోతున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు వారపు సంతల్లో మట్టి కుండల విక్రయాలు భారీ ఎత్తున సాగుతుండటంతో తయారీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఫుట్ పాత్‌పై విక్రయానికి ఉంచిన మట్టి కుండలు



ఆరోగ్యకరం..

35 ఏళ్లుగా వారపు సంతల్లో మట్టి కుండలు అమ్ముతున్నాను. 20 ఏళ్ల కిందట తాగునీటికి, వంటలు చేసుకునేందుకు మాత్రమే మట్టికుండలు వాడే వారు. ఇప్పుడు శుభకార్యాలకు, పూజలకు మాత్రమే మొక్కుబడిగా తీసుకెళ్తున్నారు. వేసవిలో మాత్రం అధికంగా అమ్ముడుపోతున్నాయి. మట్టి కుండ వంటకాలు, తాగునీరు ఆరోగ్యకరం. నేను ఇప్పటికీ మా ఇంటిలో మట్టి కుండలనే వాడుతున్నాను.

– కె.ముత్యాలమ్మ, కుండల తయారీదారు, తెంబూరు



విక్రయాలు బాగున్నాయి..

మట్టి కుండలకు మళ్లీ ప్రాధాన్యం పెరిగింది. ముఖ్యంగా వేసవి సీజన్లో చలివేంద్రాలు, మట్టికుండల్లో వంటలు చేసేందుకు ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. మా వద్ద ట్యాప్ ఉన్న మట్టి కుండలు ఉన్నాయి. సైజును బట్టి ఒక్కోటి రూ.550 ధరకు అమ్ముతున్నాం.

– కె.వేణు, కుండల విక్రయదారుడు, కాశీబుగ్గ

రకరకాలు..



పూండి వారపు సంతలో విక్రయానికి ఉంచిన మట్టి కుండలు

- సహజసిద్ధమైన మట్టి నుంచి తయారు చేసే కుండలకు ప్రాచీన కాలం నుంచి ప్రాధాన్యత ఉంది.
- సంతలు నుంచి పట్టణాల్లో ఉన్న ఫుట్‌పాత్‌ల వరకు మట్టి కుండల వరుసలు దర్శనమిస్తున్నాయి. వీటికి డిమాండ్ కూడా ఎక్కువ.
- కుండ పరిమాణం బట్టి రూ.200 నుంచి రూ.2500 వరకు అమ్ముడుపోతున్నాయి. వేసవిలో వారపు సంతల్లో దాదాపు రూ.50 లక్షల వరకు వ్యాపారం సాగుతుంది.
- మట్టి కుండల్లో రకరకాలు ఉన్నాయి. ప్రధానంగా ఎర్తన్‌వేర్, స్టోన్ వేర్, పోర్సిలేన్, టెర్రకాట్ పాట్స్, ప్లాంటర్స్ పాట్స్, ఫ్లేమ్‌వేర్ పాట్స్ మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఇవికాక ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఈజీబై, తదితర ఆన్‌లైన్ సైట్‌లలోనూ మట్టి కుండలు లభ్యమవుతున్నాయి. టెక్నాలజీ, సైజు, మట్టి ప్రాధాన్యత బట్టి వీటి ధర రూ.180 నుంచి రూ.1550 వరకు అందుబాటులో ఉన్నాయి.
- వారపు సంతల్లో విక్రయించే ఎర్తన్‌వేర్ కుండలకు అధిక ప్రాధాన్యత ఉంది. వీటిని తక్కువ వేడిలో మండించి తయారు చేస్తారు.

ప్రయోజనాలు ఎన్నో..



- మలినాలను పీల్చుకుని నీటిని చల్లగా మార్చే అద్భుత శక్తి మట్టి కుండకు మాత్రమే ఉంది.
- ఎండలో నుంచి వచ్చి కుండ నీటితో ముఖం కడుక్కుంటే ఆహ్లాదంతో పాటు వడ దెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు.
- కుండనీటిలో సహజమైన మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. రోగ నిరోధక శక్తి మెరుగుపడి జీవక్రియలను పెంచుతుంది. శరీరానికి శక్తి లభిస్తుంది.
- దగ్గు, ఆస్తమా, ఇతర శ్వాసకోశ వ్యాధులు దరి చేరవు.

న్యూస్‌రీల్

8న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8న చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరగనుందని సీఈవో ఆర్.వెంకట్‌రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీలు, మండల పరిషత్ అధ్యక్షులు, ముఖ్య ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. సమగ్ర సమాచారంతో ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులే స్వయంగా పాల్గొనాలని సూచించారు.

మూడో వారంలో టిడ్కో ఇళ్లు అందజేత



పాత్రునివలసలో మంచినీటి పనులను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

శ్రీకాకుళం రూరల్: ఈ నెల మూడో వారంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం పాత్రునివలసలోని టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఇంజినీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లతో కలిసి పనులపై సమీక్షించారు. నాగావళి నది నుంచి మంచినీటి సరఫరా, ఎస్‌టీపీ ట్రయల్ రన్ పనులపై ఆరా తీశారు. 1280 టిడ్కో ఇళ్లను నిర్ణీత కాలంలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. ఈయనతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ ఓబులేశు, మెప్మా డైరెక్టర్ కిరణ్‌కుమార్, టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



మృతి చెందిన జింక

ఎచ్చెర్ల క్యాంపస్: కుక్కల దాడిలో జింక మృతి చెందింది. శనివారం ఎస్ఎంపురం కొండ నుంచి చెరువులో నీరు తాగేందుకు ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ సమీపంలోకి వచ్చిన జింకను కుక్కల గుంపు వెంబడించింది. సాంకేతిక శిక్షణ కేంద్రం సిబ్బంది జింకను రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అటవీ శాఖ అధికారులు వచ్చేలోపే జింక మృతి చెందింది. అనంతరం జింకకు అంత్యక్రియలు నిర్వహించారు.

పాడేరుకు ఏరువాక కేంద్రం తరలింపు



ఆమదాలవలసలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం

ఆమదాలవలస: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా(ఆమదాలవలస)లోని ఏరువాక కేంద్రాన్ని పాడేరు తరలించినట్లు సమన్వయకర్త డాక్టర్ జె.జగన్నాథం శనివారం తెలిపారు. ఇకపై శాస్త్రవేత్తలు, సిబ్బంది పాడేరులోని సీడ్‌ఫాం గోదాము వద్ద ప్రారంభించిన వ్యవసాయ పరిశోధన కేంద్రంలో విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి కేంద్రం వద్ద ఐదుగురు పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులతో బందోబస్తు సిద్ధం చేయాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పరిసరాల్లో ఇతరులు గుంపులుగా ఉండకుండా చూడాలన్నారు. జెరాక్సు సెంటర్లు తెరవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు పాల్గొన్నారు.

హాల్ టికెట్ చూపిస్తే ఉచిత బస్సు సౌకర్యం



మాట్లాడుతున్న డీఎంలు మాధవ, శర్మ

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బస్సులు నడుపుతున్నామని, పల్లెవెలుగు బస్సుల్లో హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఎస్.ఆర్ శర్మ తెలిపారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకుని ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

అరటి గెలల నీరాజనం



సారవకోట మండలం వెంకటాపురంలో కోదండ రామస్వామి ఆలయం వద్ద శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా భక్తులు వందలాది అరటి గెలలు వేలాడదీశారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకునే క్రమంలో వీటిని వేలాడదీసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

– సారవకోట

నెలాఖరులోగా ‘కంటి వెలుగు’ లక్ష్యం పూర్తి

అరసవల్లి: జిల్లాలో అన్ని ప్రాంతాల్లోనూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఈ నెలాఖరు లోగా పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి ఆదేశించారు. శనివారం స్థానిక కార్యాలయంలో పారామెడికల్ ఆప్తాలమిక్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, కనీసం నెలలో రెండుసార్లు ఆరోగ్య తనిఖీలు చేయించుకునేలా చూడాలన్నారు. ఎక్కడా మాతాశిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ భాస్కరరావు, డీఐఓ ఆర్.వి.ఎస్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీతులసి, వైద్యులు పద్మావతి, విద్యుల్లత, ఉమాసౌజన్య, భాస్కరరావు, అనంతలక్ష్మి, త్రినాథరావు, డెమో వెంకటరమణ పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

ఆనంద సంబరాలు

- జనజాతరను తలపిస్తున్న వైఎస్సార్ ఆసరా సభలు
- జగనన్నకు అక్కచెల్లెమ్మల దీవెనలు

వైఎస్సార్ ఆసరా సంబరాలు జనజాతరను తలపిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహిస్తున్న సభలకు మహిళలు పోటెత్తుతున్నారు. సీఎం చిత్రపటాలు, కటౌట్‌లకు పాలాభిషేకాలతో అభిమానం చాటుకుంటున్నారు. టీడీపీ హయాంలో రుణమాఫీ పేరిట మోసగించారని, సీఎం జగన్ మాత్రం ఎన్నికల హామీ నిలబెట్టుకుంటూ మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. శనివారం నిర్వహించిన సంబరాల్లో పాల్గొనేందుకు మహిళలు వర్షాన్ని సైతం లెక్కచేయలేదు.

–సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



గార: ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



సరుబుజ్జిలి: ఆసరా చెక్కుల పంపిణీకి హాజరైన స్వయం సహాయక సంఘ సభ్యులు

ఆత్మగౌరవం పెంచేందుకే...

మహిళల ఆత్మగౌరవం పెంచేందుకే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆసరా పథకాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. మహిళలకు మరింత ఊతం ఇచ్చేందుకే ఈ ఆసరా. మేలు చేసే ప్రభుత్వానికి అందరూ మద్దతుగా నిలవాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళల మీద నమ్మకం ఉంది.. రానున్న రోజుల్లో మీ అండదండలు ఆయనకు ఉండాలి. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాల రద్దుకు కార్యాచరణ రూపొందించి, ఇప్పటికే మూడు విడతల్లో నగదును చెల్లించిన విషయాన్ని గుర్తించాలి. నిత్యం కుటుంబాన్ని మోసే మహిళలకు అండగా ఉండేందుకు.. వారి బాధ్యతల్లో ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ఆసరా ఉపయోగపడుతుంది. సీఎం జగన్ డబ్బులను వృథా చేస్తున్నారని విపక్షాలు అంటున్నాయి. ఆ దుష్ప్రచారాన్ని మీరంతా తిప్పికొట్టాలి.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ శాఖ మంత్రి (గార మండలంలో నిర్వహించిన ఆసరా పంపిణీలో)

మళ్లీ జగన్‌ను సీఎం చేయాలి..



వజ్రపుకొత్తూరు: సభలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మహిళలకు మాట ఇచ్చి నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిన్నారుల చదువుల నుంచి అక్క చెల్లెమ్మల ఆర్థిక భరోసా వరకు నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే. గతంలో మాదిరిగానే చంద్రబాబుకు మహిళలంతా బుద్ధి చెప్పాలి. మళ్లీ వైఎస్ జగన్ సీఎం అయితేనే ఎంతో మేలు జరుగుతుంది.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి (వజ్రపుకొత్తూరులో నిర్వహించిన ఆసరా పంపిణీ కార్యక్రమంలో..)



మెళియాపుట్టి: ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు హాజరైన జనసందోహం

శనివారం జిల్లాలో ఎక్కడెక్కడ..

- గార మండల అంబటివానిపేట సమీపంలోని సాందీపని స్కూల్ ఆవరణలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన ఆసరా మూడో విడత సంబరాలను నిర్వహించారు. శ్రీకాకుళం టౌన్ హాలులో కూడా జరిగాయి.
- పలాస జూనియర్ కళాశాల మైదానంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ ఆధ్వర్యంలో ఆసరా పంపిణీ కార్యక్రమాలు జరిగాయి.
- వజ్రపుకొత్తూరులో ఎంపీపీ నీలవేణి ఆధ్వర్యంలో ఆసరా పంపిణీ జరిగింది.
- సరుబుజ్జిలిలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి చిరంజీవి నాగ్ ఆధ్వర్యంలో ఆసరా పంపిణీ జరిగింది.
- మెళియాపుట్టి ప్రభుత్వ కళాశాల మైదానంలో ఎంపీపీ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఆసరా పంపిణీ జరిగింది.
- నరసన్నపేట మండలం ఉర్లాం హైస్కూల్ మైదానంలో ఎంపీపీ ఆరంగి మురళి ఆధ్వర్యంలో ఆసరా పంపిణీ జరిగింది.



నరసన్నపేట: ఉర్లాం ఆసరా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

క్లుప్తంగా

అక్రమ క్వారీలో అధికారుల తనిఖీలు



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

పొందూరు: మండలంలోని వీఆర్ గూడెం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 137లో ఉన్న కొండ గ్రావెల్ క్వారీలో అక్రమ తవ్వకాలపై శనివారం మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గురువారం రాత్రి అక్రమ తవ్వకాలు చేస్తుండగా విద్యార్థి బగాది మణికంఠ (20) మృతి చెందడంతోనే అక్రమ క్వారీ నిర్వహణ వెలుగులోకి వచ్చింది. సర్వే నంబర్ 137లో సుమారు 475.95 ఎకరాల కొండ ప్రాంతం ఉండగా, సంఘటన జరిగిన ప్రదేశంలో సుమారు 1200 క్యూబిక్ మీటర్లు తవ్వకాలు జరిపినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. తనిఖీల్లో మైనింగ్ డీడీ ఫణిభూషణ్ రెడ్డి, ఏడీ బాలాజీ నాయక్, సర్వేయర్ గోవిందరావు, ఆర్ఐ రాధ, వీఆర్వో సూర్యప్రకాశరావు ఉన్నారు. కాగా చుట్టుపక్కల ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై అధికారులు సమాచారం ఇవ్వకపోవడం, వాటి గురించి ప్రస్తావన లేకపోవడం విశేషం.

తుంగతంపరలో చైన్‌స్నాచింగ్



బాధితురాలు అమ్మలు నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

హిరమండలం: తుంగతంపర గ్రామ సమీపంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతంపర గ్రామ కాలనీకి చెందిన గుజ్జాపు అమ్మలు వృత్తిలో భాగంగా రోజూ ఉదయం పూట గ్రామ సమీపంలోని చెరువుకు దుస్తులను ఉతికేందుకు వెళ్లి మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వస్తుంటారు. శనివారం కూడా చెరువు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని పరారయ్యారు. వెంటనే బాధితురాలు కేకలు వేయడంతో దుండగులు నవతల గ్రామం వైపు ఉడాయించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.నారాయణ స్వామి తెలిపారు.

పొలాల్లోకి దూసుకుపోయిన కారు

- ముగ్గురికి స్వల్ప గాయాలు



పొలాల్లో ఉన్న కారు

కాశీబుగ్గ: కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన పలాస మండలం తర్లాకోట గ్రామం కాటమ్మ తల్లి ఆలయ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన ముగ్గురు యువకులు గారబంద నుంచి పలాస వయా గొప్పిలి మీదుగా కారులో వస్తుండగా.. తర్లాకోట వద్ద అదుపుతప్పి పంట పొలంలోకి దూసుకుపోయి ఆగిపోగా.. అందులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	59,670-00
బంగారం(22క్యా. 10గ్రా.)	54,700-00
వెండి (కిలో)	76,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹113	₹196	₹ 206

రణస్థలం.. ప్రథమ స్థానం

- ఉపాధి హామీ పథకం అమల్లో రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన మండలం
- ప్రణాళికాబద్ధంగా పనుల నిర్వహణ



ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులు

రణస్థలం:

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రణస్థలం మండలం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. గ్రామాల్లోనే ఉపాధి కల్పించి వలసలు నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా మండల వ్యాప్తంగా 34 పంచాయతీల్లో ప్రణాళికాబద్ధంగా ఉపాధి పనులు సాగాయి. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ కనీసం పది రోజుల నుంచి వంద రోజులు వరకు పని చేయడంతో రణస్థలం మండలం జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు కైవసం చేసుకుంది.

అత్యధికంగా చేపట్టిన పనులివే

- చెరువులో పూడికతీతలు
- తోటల్లో కందకాలు తవ్వడం
- వ్యవసాయ కాలువల్లో పూడిక తీతలు
- చిన్న సన్న రైతులకు వ్యవసాయ పనుల్లో తోడ్పాటునందించడం
- పశువుల కోనేరులో పూడికతీత పనులు
- చెరువు గట్లపై మొక్కల పెంపకం
- ఉద్యావన పండ్ల తోటలు పెంచడం
- రహదారులకు ఇరువైపులా మొక్కల పెంపకం

కింది ఐదు విభాగాల్లోనూ జిల్లాలో రణస్థలం ప్రథమ స్థానంలో నిలిచింది

వివరాలు	రణస్థలం	జిల్లా
100 రోజులు పూర్తి చేసిన వేతనదారులు(కుటుంబాలు)	3,810	49,915
మొత్తం పని చేసిన కుటుంబాలు	19,686	4,30,468
పని చేసిన వేతనదారులు	32,977	7,45,128
మొత్తం పని దినాలు	12,40,638	2,94,00,000
వేతనాల రూపంలో చెల్లింపులు చేసిన మొత్తం	రూ.22.24 కోట్లు	380.10 కోట్లు

అభినందనీయం



ఉపాధి హామీ పథకం అమలులో 2022–23గాను రణస్థలం మండలం రాష్ట్రస్థాయిలో ప్రథమంగా నిలవడం అభినందనీయం. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను చక్కగా చేయించారు.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

అందరికీ పని..



రణస్థలం మండలంలో జాబ్ కార్డు కలిగిన వేతనదారులందరికీ కనీసం పది నుంచి వంద రోజుల వరకు పని కల్పించాం. వేతనాల రూపంలో ఒక్క రణస్థలానికే రూ. 22.24 కోట్లు చెల్లించాం.

– ఎం.శ్రీనివాసనాయుడు, రణస్థలం ఏపీఓ

సద్వినియోగం చేసుకున్నారు



రణస్థలం ఉపాధి హామీ వేతనదారులు సగటు పని దినాలు అత్యధికంగా చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. ఇదే తరహాలోల జిల్లా వ్యాప్తంగా పని చేసి జిల్లాను రాష్ట్రంలో ముందుస్థానంలో నిలపాలి.

– చిట్టిరాజు, డ్వామా పీడీ

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- సమీక్ష సమావేశంలో ఎస్పీ జి.ఆర్.రాధిక



నెలవారీ నేరసమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: నేర నియంత్రణకు నిఘా నేత్రం (సీసీ కెమెరాల)తో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధిక అధ్యక్షతన నెలవారీ నేర సమీక్షా సమావేశం శనివారం జరిగింది. ముందుగా స్పందన ఫిర్యాదులు, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, తీవ్ర నేరాలు (గ్రేవ్ కేసులు), ఎన్‌డీపీఎస్ యాక్ట్, ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లోని పలు అంశాలపై సమీక్ష నిర్వహించి ముఖ్యమైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని ముఖ్యకూడళ్లలో బంగారం దుకాణాలు, వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని తరహా నేరాలు ఛేదించడంలో సీసీ ఫుటేజీ కీలకమన్నారు. మహిళా పోలీసులతో క్షేత్రస్థాయిలో ఎమ్‌ఆధార్ యాప్‌లో బయోమెట్రిక్ ఎనేబుల్డ్ పేమెంట్ సర్వీసులో డబ్బు పోగొట్టుకునే విధానం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు, అక్రమ రవాణా, అక్రమ వ్యాపారుల వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ కేసుల్లో ప్రాపర్టీ సీజింగ్, కేసు దర్యాప్తు, ముద్దాయిల అరెస్టులో జాగ్రత్తలను పాటిస్తూ ముద్దాయిలకు జైలు శిక్ష పడేలా చేయాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టిసారించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిశితమైన సాక్ష్యాధారాలు సేకరించాలని, 60 రోజుల్లోగా దర్యాప్తు పూర్తిచేసి కేసుకు సంబంధించిన అన్ని రకాలైన పత్రాలతో కోర్టులో అభియోగం పత్రాలను దాఖలు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో వంటి ముఖ్య కేసులన్నింటిలో ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సాక్ష్యాధారాల సేకరణలో, సాక్షుల విచారణలో జాగ్రత్తలు పాటిస్తూ ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఆధారాలు పంపించాలన్నారు. వారిచ్చిన అభిప్రాయాల మేరకు నిర్ణీత గడువులోగా దర్యాప్తును పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. సాంకేతికతతో త్వరితగతిన సైబర్ కేసులను దర్యాప్తు చేయాలని, మహిళా పోలీసులను సమన్వయం చేసుకుంటూ దిశ యాప్, సైబర్ మోసాలపై గ్రామ, పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీకాంత్, అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు ఎం.మహేంద్ర, సీహెచ్ ప్రసాదరావు, ఎస్.వాసుదేవ్, జి.శ్రీనివాసరావు, ఎం.శివరామరెడ్డి, కె.బాలరాజు, డి.ప్రసాదరావు, ఏవో ఎం.శివరామరాజు, సీఐలు, వివిధ పోలీసు స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.

వీరగున్నమ్మ కీర్తి..

భావితరానికి స్ఫూర్తి



మందసలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- రాజ్యసభ మాజీ సభ్యుడు పి.మధు
- ఘనంగా వర్ధంతి కార్యక్రమాలు
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు

మందస: తెల్లదొరలపై కత్తులు దూసిన వీరగున్నమ్మ కీర్తిని భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు పి.మధు అన్నారు. గుడారిరాజమణిపురం(వీరగున్నమ్మపురం) గ్రామానికి చెందిన వీరనారి సాసుమాన గున్నమ్మ 83వ వర్ధంతి కార్యక్రమాలు వీరగున్నమ్మపురం సమీపంలో గున్నమ్మ స్థూపం, మందసలో శనివారం జరిగాయి. మందసలోని బస్టాండ్‌లో సీఐటీయూ, గిరిజన సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మధు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల కాల్పుల్లో వీరగున్నమ్మతో పాటు ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. తెల్లదొరల సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నడిపిన గొప్ప రైతాంగపోరాటమన్నారు. నాడు, నేడు కూడా జమీందారులకు ప్రభుత్వాలు కార్పొరేట్లు పరుస్తున్నాయని ధ్వజమెత్తారు. గతంలో విదేశీ దురాక్రమణలు జరగ్గా, నేడు స్వదేశీ అరాచకాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రకృతి వనరులైన గాలి, నీరు, భూమి, సూర్యరశ్మి, అడవులు, గనులు అదాని కంపెనీలకు ధారదత్తం చేస్తున్నారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ.. వంశధార, ఆఫ్‌షోర్ రిజర్వాయర్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, జీడి రైతులకు మద్దతు ధర క్వింటాకు రూ.16 వేలు ప్రకటించాలన్నారు. గిరిజన భూములను ఆక్రమించుకుంటున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా వీరగున్నమ్మ స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మందస పురవీధుల్లో ర్యాలీ, ప్రదర్శన చేశారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రజా సంఘాల నాయకులు మట్ట ఖగేశ్వరరావు, కె.నాగమణి, బి.కృష్ణమూర్తి, సంగారు లక్ష్మీనారాయణ, సవర ధర్మారావు, పోలాకి ప్రసాదరావు, ఎస్.గణపతి, కె.కేశవరావు, మట్ట ధర్మారావు ప్రసంగించారు. వీరగున్నమ్మ చరిత్ర ప్రచారకమిటీ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు వాయలపల్లి మాధవరావు, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబుచౌదరి, సాసుమాన లోకేశ్వరరావులు కూడా గున్నమ్మ స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- బీఆర్‌ఏయూ వీసీ వెంకటరావు



విద్యార్థి ప్రశ్నకు సమాధానం ఇస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బీఆర్‌ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో నెలలో మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ వర్సిటీ ఫోన్ ఇన్‌లైవ్ కార్యక్రమాన్ని ఉదయం పది నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. విద్యార్థుల ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. అనంతరం సమస్యలపై వీసీ సమీక్షించారు. విద్యార్థులు ప్రస్తావించిన సమస్యలు పరిష్కరించాలని, వారి సూచనలు, సలహాలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ఫోన్ ఇన్ లైవ్‌లో విద్యార్థులు ప్రధానంగా డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని, డిగ్రీ ఏడాది విధానంలో పరీక్ష రాసిన విద్యార్థులు ఇంకా పాస్ కాలేదాని వారికోసం ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని కోరారు. డిగ్రీ 2, 4 సెమిస్టర్ ఫలితాలు విడుదలపై ప్రశ్నించారు. డిగ్రీ, పీజీ రీవాల్యుయేషన్ ఫలితాల జాప్యంపై అడిగారు. అధికారులు స్పందిస్తూ ఏటా స్పెషల్ డ్రైవ్ పరీక్షల నిర్వహణ సాధ్యం కాదని, పరీక్ష ఫలితాలు జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా విడుదల చేస్తున్నామన్నారు. రీవాల్యుయేషన్ ఫలితాలు షెడ్యూల్ మేరకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య, ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

జగన్నాథ సంస్కృతిని విస్తరింపజేయాలి



పూరీ కళాకారుల నృత్య ప్రదర్శన

కాశీబుగ్గ: జగన్నాథ సంస్కృతిని విస్తరింపచేయాలని ఒడియా సంఘ అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి అన్నారు. కాశీబుగ్గ బృందావన చంద్ర ఆలయంలో 87వ ఒడిశా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా ఒడియా బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒడియా సంస్కృతి, ఆచారాలను కొనసాగించేలా చూడాలన్నారు. ఒడియా భాషా ఔన్నత్యాన్ని వివరించారు. ఒడియా సంఘ అభివృద్ధి సభ్యుడు సత్యనారాయణ పాడి, జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ త్యాడి భవిష్యత్తులో సంఘం అభివృద్ధికి చేపట్టనున్న ప్రణాళికలు వివరించారు. అనంతరంకి పూరీకి చెందిన నృత్య కళాకారుల ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో మందస, పలాస, శ్రీకాకుళం సంఘ నాయకులు హాజరయ్యారు.

ఉత్సాహంగా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు పోలీస్ క్రీడా మైదానంలో జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు ఉత్సాహంగా శనివారం జరిగాయి. విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు, కిట్లు అందజేశారు. జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ మాట్లాడుతూ.. నిరంతర సాధనతోనే క్రీడాకారులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త సూర శ్రీనివాసరావు, నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు, కొత్తకోట సూర్యారావు, శిక్షకులు మధుసూదనరావు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకంపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట పంచాయతీ సుబ్బన్న చెరువులో అక్రమ గ్రావెల్ తరలింపుపై ఎచ్చెర్ల ఎస్సై వి.సత్య నారాయణ శుక్రవారం సాయంత్రం కేసునమోదు చేశారు. గత నెల 30వ తేదీన చెరువులో గ్రావెల్ అక్రమంగా కొంతమంది తరలిస్తున్నారని ఆయకట్టు రైతులు కొందరు తహసీల్దార్ టి.సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు అక్రమ గ్రావెల్ తరలింపు ప్రమేయంపై మొదలవలస కృష్ణారావు, సత్తారు గోపి, గురుగుబెల్లి మహేశ్వరరావు, సత్తారు కోటేశ్వరరావులపై కేసు నమోదు చేశారు. మూడు ట్రాక్టర్లు, జేసీబీ నంబర్ల ఆధారంగా కేసు నమోదు చేశారు. కేసును రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు.

ఘనంగా 'ట్వింకిల్ కిడ్స్' వార్షికోత్సవం



రైతు నాటికలో చిన్నారుల ప్రదర్శన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చిన్నారులను చదువుతో పాటు క్రమశిక్షణ, శాస్త్రసాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే ట్వింకిల్ కిడ్స్ స్కూల్ లక్ష్యమని ప్రముఖ వైద్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు దానేటి శ్రీధర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ట్వింకిల్ కిడ్స్ స్కూల్ 10వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు పాటలకు డ్యాన్స్‌లు చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రాఘవదాస్, సుగుణాకర్, అంధవరపు రమేష్, డాక్టర్ కొర్ల విద్యాసాగర్, డాక్టర్ కర్రి లక్ష్మీసాజన్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గత నెల ఆరో తేదీన శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అధ్యయనం-పోరాటం అనే నినాదాలతో దేశవ్యాప్తంగా ఈ పోటీలను నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి మొదటి స్థానంలో ఎస్.యశశ్విని (శ్రీ చైతన్య స్కూల్), రెండవ స్థానంలో డీవీఎం సుదీర్ (ఎన్టీఆర్ ఎంహెచ్‌స్కూల్), 3వ స్థానంలో బి.ప్రియవర్శిని (సిద్ధార్థ స్కూల్) నిలిచారు.

వీరికి ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ శ్రీకాకుళం జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, వాసు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ స్పాట్ ప్రారంభం

- ఫస్ట్‌స్పెల్ సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనం
- పర్యవేక్షిస్తున్న ఆర్‌ఐఓ, క్యాంప్ అధికారులు
- నేడు రిపోర్ట్ చేయనున్న స్క్రూటినైజర్లు



ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియలో ఎగ్జామినర్లు, సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కేంద్రంగా జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ జరుగుతోంది. తొలిరోజు మొదటి స్పెల్‌లో భాగమైన తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మ్యాథ్స్, సివిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ఆరంభించారు.

రిపోర్ట్‌చేసిన అధికారులు, ఎగ్జామినర్లు..

స్పాట్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఏసీవోలు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ రిపోర్ట్ చేయగా, శనివారం చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లు రిపోర్ట్ చేశారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మ్యాథ్స్, సివిక్స్‌సబ్జెక్టులకు కలిపి తొలిరోజు 400 మంది వరకు రిపోర్ట్ చేశారు. ఆదివారం స్క్రూటినైజర్లు రిపోర్ట్ చేయనున్నారని క్యాంప్ ఆఫీసర్లు వెల్లడించారు.


అప్రమత్తంగా వ్యవహరించాలి..

ఎగ్జామినర్లు, సిబ్బంది, ఇతర యంత్రాంగానికి జిల్లా ఆర్‌ఐఓ/స్పాట్ క్యాంప్ ఆఫీసర్ ఎస్.తవిటినాయుడు, క్యాంప్ జనరల్–1 బి.శ్యామ్‌సుందర్, జనరల్–2 కీర్తి తవిటినాయుడు పలు సూచనలు చేశారు. స్పాట్ ప్రక్రియలో భాగస్వామ్యం అవుతున్న ప్రతి ఒక్కరు కచ్చితంగా సమయపాలన పాటించాలని, సెల్‌ఫోన్లు తీసుకురావద్దని సూచించారు. మూల్యాంకనం సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మార్కుల పోస్టింగ్, బబ్లింగ్ పక్కాగా ఉండాలన్నారు.

కుస్తీ పోటీల్లో సోనియా, చామంతి ప్రతిభ



పాతపట్నం: పతకం స్వీకరిస్తున్న సోనియా



హిరమండలం: సిల్వర్ మెడల్ అందుకుంటున్న చామంతి

పాతపట్నం, హిరమండలం: జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో పాతపట్నం, హిరమండలం మండలాలకు చెందిన యువతులు ప్రతిభకనబర్చారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం దివాస్‌లోని శ్రీమంత్ టుకోజిరో పవర్ స్పోర్ట్స్ స్టేడియంలో నేషనల్ జూ–జిస్ట్ చాంపియన్ షిప్–2022–23 ఆధ్వర్యంలో మార్చి 30, 31వ తేదీల్లో జాతీయస్థాయి కుస్తీ పోటీలు జరిగాయి. ఇందులో పాల్గొన్న పాతపట్నం శివశంకర్ కాలనీకి చెందిన చెందిన నల్ల సోనియా, హిరమండలం మండలం గులుమూరు పంచాయతీ చాపరాయిగూడకు చెందిన బిడ్డికి చామంతి ప్రతిభ కనబర్చి సిల్వర్ పతకాలు సాధించారు. గతంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో తైక్వా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలిండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కూడా నల్ల సోనియా 56 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది.

అలాగే విశాఖపట్నంలో తైక్వా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరో ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2023లో 56 కేజీల విభాగంలో రజక పతకం సాధించింది. హిరమండలం మండలం సుభలయ గ్రామానికి చెందిన సింహచలం వద్ద సోనియా శిక్షణ పొందింది. చామంతి కూడా వివిధ పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించింది.